ప్రజాశక్తి
శనివారం 30 ఆగస్టు 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహం

◆ ఎపిని ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

◆ ఇండియా ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

సమ్మిట్‌కు హాజరైన వారితో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో ఎంఎస్ఎంఇలను ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం అందిస్తున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌కు రాష్ట్రంలో పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు. శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (టిపిసిఐ) నిర్వహించిన ఇండియా ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఫుడ్, బేవరేజ్ యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశాలు కల్పిస్తూ 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ప్రజల ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలితో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అపారమైన అవకాశాలు వస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శి అవినాష్ జోషి మాట్లాడుతూ దేశంలో ఆహార ప్రాసెసింగ్ రంగం ఉత్సాహభరితంగా ఉందన్నారు. అయితే దాని సామర్థ్యం అపరిమితమని పేర్కొన్నారు. భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తులలో కేవలం 12 శాతం మాత్రమే ప్రాసెస్ అవుతున్నాయన్నారు. వియత్నాం, థాయిలాండ్ వంటి దేశాల్లో ఈ సంఖ్య 40 పైచిలుకు శాతంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ముందంజలో ఉందని తెలిపారు. పిఎమ్‌జిఎస్‌వై కింద దాదాపు రూ.3,500 కోట్ల విలువైన 77 ప్రాజెక్టులు ఆమోదం పొందాయని తెలిపారు.

డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభిస్తున్న సిఎం

అమరావతిలో ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యాలయం

త్వరలోనే అమరావతిలో టిపిసిఐ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని ఆ సంస్థ చైర్మన్ మోహిత్ సింగ్ వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్న పండ్లు, ఆక్వా, ఇతర ఆహార ఉత్పత్తి దారులు, ఎగుమతిదారులతో మిగతా 2లో..

దగ్ధమవుతున్న బస్సు

బస్సు దగ్ధం

- ఘటన సమయంలో పరిమితికి మించి ప్రయాణికులు

ప్రజాశక్తి - సీతమ్మధార

విశాఖ నగరంలోని శాంతిపురం వద్ద శుక్రవారం ఉదయం 8:20 గంటల సమయంలో ఆర్‌టిసి బస్సు దగ్ధమైంది. మంటలను గమనించి డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేసి ప్రయాణికులందరినీ దించేశాడు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టు కొందరు చెబుతున్నారు. ప్రభుత్వ తీరే కారణమని మరికొందరు అభిప్రాయ పడుతున్నారు. ప్రమాద సమయంలో పరిమితికి మించి బస్సులో ప్రయాణికులు ఉన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన కూటమి ప్రభుత్వం అందుకు తగ్గట్టు బస్సుల సంఖ్యను విశాఖ నగరంలో పెంచలేదు. దీంతో ప్రతిరోజూ కొన్ని సర్వీసుల్లో 80 నుంచి 90 మంది వరకూ ప్రయాణిస్తున్నారు. శుక్రవారం దగ్ధమైన బస్సులోనూ 90 మంది వరకూ ప్రయాణిస్తున్నారు. ఆ ప్రభావం ఇంజిన్‌పై పడి మంటలు రేగినట్టు మిగతా 2లో..

ప్రభుత్వ పాఠశాలల్లో ఎఐ ల్యాబ్‌లు ప్రారంభం

▶ వార్త 4లో..

పాడేరు వెళ్లే రోడ్లను బాగు చేయాలి

▶ వార్త 2లో..

అభివృద్ధి ప్రణాళికలపై చర్చ

- 500 మంది క్రియాశీలక సభ్యులతో పవన్ భేటీ

▶ వార్త మెయిన్‌లో..

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

విశాఖ ప్రజలకిచ్చిన వాగ్దానాలపై సిఎం, డిప్యూటీ సిఎం ప్రకటన చేయాలి

వామపక్ష పార్టీల ధర్నా వార్త మెయిన్‌లో..

వ్యవహారిక భాషకు గొడుగు.. గిడుగు

తెలుగు భాషా దినోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వ్యవహారిక భాషకు గొడుగు పట్టిన మహనీయులు గిడుగు వెంకట రామమూర్తి పంతులును స్మరించుకోవడం తనకు లభించిన అదృష్టమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో తెలుగు భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, తెలుగు తీయదనాన్ని సామాన్యునికి చేరువచేసేందుకు గిడుగు చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలుగు భాషా పురస్కార కమిటీ ఎంపిక చేసిన గిడుగు వెంకట రామమూర్తి పంతులు పురస్కారాల గ్రహీతలను ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రతి అవార్డు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

గ్రహీతకు రూ.25 వేల నగదు పురస్కారం, జ్ఞాపిక అందజేశారు. కళా, సాహిత్య రంగాల్లో వారు చేసిన కృషిని ప్రశంసించారు. మరిన్ని కాలాల పాటు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు.

కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, అవనిగడ్డ శాసనసభ్యులు, తెలుగు భాషా పురస్కార కమిటీ సభ్యులు మండలి బుద్ధప్రసాద్, సృజనాత్మకత, జానపద కళల అకాడమీ ఛైర్మన్ గంగులయ్య, ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.మల్లికార్జునరావు, గిడుగు రామమూర్తి పంతులు మనవడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహం

అనుసంధానం కావడానికి వీలుగా ఈ కార్యాలయం దోహదపడుతుందని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి చౌదరి మాట్లాడుతూ పండ్లు, ఆక్వా రంగాల్లో ఆంధ్రప్రదేశ్ అతిపెద్ద ఎగుమతిదారుగా ఉందన్నారు. సమావేశంలో మంత్రులు టిజి.భరత్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సిఇఒ జి.శేఖర్ బాబు, ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి.దాసు, జాయింట్ డైరెక్టర్ బాయ్ పాయ్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జిఎం హనుమా నాయక్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొన్నారు.

హాప్ ఆన్ హాప్ ఆఫ్ బస్సులు ప్రారంభం

ఎంవిపి.కాలనీ : ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకూ బీచ్ రోడ్డులో ప్రయాణించనున్న డబుల్ డెక్కర్ బస్సులను విశాఖ బీచ్ రోడ్డులోని కాళీమాత టెంపుల్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జెండా ఊపి ప్రాంభించారు. మొత్తం 16 కిలోమీటర్ల మేర పర్యాటక ప్రాంతాల్లో ఈ ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు తిరగనున్నాయి. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాప్ ఆన్ హాప్ ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సులో ప్రజాప్రతినిధులతో కలిసి ప్రయాణించారు. ఆర్కే బీచ్ నుంచి బీచ్ రోడ్డు మీదుగా సాగిన ప్రయాణంలో పర్యాటకులకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. అనతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 24 గంటల పాటు ప్రయాణించేలా టికెట్ ఛార్జీని రూ.500 నిర్ణయించినప్పటికీ, ప్రయాణికుల సౌలభ్యం కోసం సగం మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. రూ.250కే 24 గంటల పాటు టికెట్టును వర్తింపచేసేలా ఆదేశాలు ఇస్తున్నామని తెలిపారు. పర్యాటకులంతా పర్యావరణ హితంగా వ్యవహరించాలన్నారు. విశాఖ ఆర్థిక రాజధానిగా, ఆసియా టెక్నాలజీ హబ్‌గా ఎదగబోతోందని తెలిపారు. విశాఖకు డేటా సెంటర్, సీ కేబుల్ వస్తాయన్నారు. ఈ కేబుల్ ద్వారా విశాఖతో మిగతా ప్రపంచం అనుసంధానం అవుతుందని అన్నారు.

డబుల్ డెక్కర్‌బస్సులకు
విశాఖ పోర్టు నిధులు రూ.4 కోట్లు

చంద్రబాబు ప్రారంభించిన డబుల్ డెక్కర్ బస్సులకు విశాఖపట్నం పోర్టు అథారిటీ (విపిటి) రూ.4 కోట్లు నిధులను సిఎస్ఆర్ కింద రాష్ట్ర టూరిజం శాఖకు అందజేసింది. ఈ మేరకు పోర్టు అధికారులు ఆ కార్యక్రమంలో పాల్గొన్నప్పటికీ అది ప్రభుత్వ నిధులతో చేపట్టినట్లు జిల్లా అధికార యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకొచ్చాయి. ఎక్కడా పోర్టు ప్రస్తావన బయటకు రానివ్వకపోవడం కనిపించింది. సిఎం చంద్రబాబు ప్రసంగ సమయంలో పోర్టు అధికారులు స్వయంగా కాగితంపై రాసి ఇచ్చినా పోర్టు సాయం గురించిన ఆయన ప్రస్తావన చేయలేదన్న చర్చ స్థానికంగా జరిగింది.. ఒక్కో డబుల్ డెక్కర్ బస్సు రూ 2 కోట్లు కాగా రెండు బస్సులకు పోర్టు అథారిటీ రూ.4 కోట్లను అందజేసింది.. పోర్టు అధికారులు, విపిఎ కార్యదర్శి టి.వేణుగోపాల్ సహా పలువురు శు క్రవారం బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బస్సు దగ్ధం

సోషల్ మీడియాలో పలువురు పేర్కొంటున్నారు. ఈ బస్సు కూర్మన్నపాలెం నుంచి విజయనగరానికి వెళ్తోంది. శాంతిపురం పెట్రోల్ బంకు పక్కనే బస్సు దగ్ధం కావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ప్రమాద సమయంలో మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. పెను ప్రమాదం నుంచి బయటపడ్డామని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంజిన్ నుంచి మంటలు వచ్చాయని డ్రైవర్ తెలిపారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలన్నారు. డ్రైవర్ రమేష్ ప్రయాణికులను సరైన సమయంలో దించి ప్రాణాలు కాపాడినందుకు అతన్ని సిఎం చంద్రబాబు అభినందించారు.

పాడేరు వెళ్లే రోడ్లను బాగు చేయాలి

- పవన్‌కు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక విజ్ఞప్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అనకాపల్లి, విశాఖపట్నం జిల్లా కేంద్రాల నుండి పాడేరు జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని, వెంటనే వాటి మరమ్మతు చర్యలు చేపట్టాలని ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జనసేన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాల నిమిత్తం పవన్ విశాఖ వచ్చిన సందర్భంగా ఈ ప్రాంతంలోని కొన్ని ప్రధాన సమస్యల పరిష్కారాన్ని ప్రజలు ఆశించడం సహజమని అజశర్మ పేర్కొన్నారు. అందులో ముఖ్యమైనది స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశమని పేర్కొన్నారు. అలాగే విలువైన సముద్ర తీర భూమిని లులూ మాల్‌కు అప్పగించడం వంటి సమస్యలూ ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు స్వయంగా పవన్ ప్రత్యక్షంగా రోడ్ల సమస్యలపై ఆందోళన చేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. కూటమి అధికారంలోనికి వచ్చిన వెంటనే ఈ ఏడాది సంక్రాంతికే గుంతలు లేని రోడ్లు తమ లక్ష్యమని ప్రకటించారన్నారు. ఆ కాలం గడిచిపోయి 2026 సంక్రాంతి పండగ సమీపిస్తున్నా పాడేరు వెళ్లేందుకు సరైన రోడ్లు లేవన్నారు. చోడవరం, వడ్డాది మధ్య వంతెన నిర్మాణం సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉందని, దాని పక్కనే ఉన్న తాత్కాలిక డైవర్షన్ మార్గం కూడా పలు సందర్భాలలో మూతబడుతోందని అజశర్మ తెలిపారు. అల్లూరి జిల్లా కేంద్రాన్ని కలిపే రోడ్లే ఈ రకంగా ఉంటే, ఇక మిగిలిన ప్రాంతాల్లోని రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో సులువుగానే అర్థం చేసుకోవచ్చునని తెలిపారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

జాతీయ క్రీడా దినోత్సవంలో మంత్రి నారా లోకేష్

క్రీడాకారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న లోకేష్, రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రభుత్వ పరంగా క్రీడాకారులను పోత్సహిస్తామని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. భారత హాకీ లెజెండ్, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శాప్ ఆధ్వర్యంలో ఎయు కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పుడున్న పిల్లలు యూట్యూబ్, పబ్జీలకు అలవాటుపడ్డారన్నారు. వాటికి ఫుల్ స్టాప్ పెట్టాలంటే గ్రాస్ రూట్ మూమెంటమ్ క్రియేట్ చేస్తేనే సమాజంలో మార్పు వస్తుందని తెలిపారు. ఎనర్జీ, టాలెంట్, డిటర్మినేషన్ ఆంధ్ర రాష్ట్ర యువకుల రక్తంలోనే ఉందన్నారు. అనంతరం చెస్ క్రీడాకారిణి హంపీ తాను ఎదుర్కొన్న కష్టాలను తెలియజేశారు. క్రీడల్లో పిల్లలను తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించని సందర్భాలు ఉన్నాయన్నారు. పట్టుదల, తపన ఉంటే రాబోయే రోజుల్లో ఉన్నత స్థానాలకు ఎదగొచ్చన్నారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొన్న ప్రముఖ క్రీడాకారులు పి.గోపీచంద్, ఎంఎస్‌కె.ప్రసాద్, కోనేరు హంపీ, సాకేత్ సాయి మైనేని, యర్రాజి జ్యోతి, ఇ.రజిని, డి.జ్యోతికశ్రీ, షేక్ జెఫ్రిన్, పి.శివారెడ్డి, సత్యగీతతో పాటు పలువురు క్రీడాకారులను మంత్రి లోకేష్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంపి శ్రీభరత్, మంత్రులు వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయ స్వామి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఎమ్‌డి పిఎస్ గిరీషా, ఎమ్మెల్యే గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా న్యాయసేవాసదన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో శుక్రవారం అసంఘటిత కార్మికుల సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. న్యాయసేవా సాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ, ముఖ్యంగా, బీమా క్లెయిమ్, ఆరోగ్య బీమా, ప్రమాదబీమా క్లెయిమ్, నష్టపరిహారం, వైద్య, ఆరోగ్య సదుపాయాలపై తెలియజేశారు. అసంఘటిత కార్మికులు తమ హక్కులు, ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. న్యాయసహాయం అవసరమైనప్పుడు ఉచితంగా లభించే సేవలను వినియోగించుకోవాలని సూచించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 ఉచిత న్యాయ సహాయము మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో పిఎల్ ఎపియుఎస్ ఛైర్మన్ జి. వల్లభనాయుడు, కార్మికశాఖ సహాయ కమిషనర్ (సర్కిల్-1) మోహనలక్ష్మి పాల్గొన్నారు. ప్లాపుస్ ఛైర్మన్ జి.వల్లభనాయుడు మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం కోసం తమ సంస్థ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు.

ఎన్ఎడి సిజిఎంపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్ఎడి సిజిఎం చర్యలపై సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ రెడ్డి వెంకటరావు, కన్వీనర్ పి.గోపాలకృష్ణ కోరారు. ప్రభుత్వ రంగంలో ఆయుధ పరిశ్రమలను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మీడియాకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజనాథ్‌సింగ్ విశాఖపట్నం వచ్చిన సందర్భంగా, రక్షణ రంగ కార్మికుల సమస్యలపై వినతి పత్రం ఇచ్చేందుకు తాము ప్రయత్నించగా, భద్రతా కారణాల దృష్ట్యా అనుమతించని కారణంగా, మీడియా ద్వారా ప్రకటన విడుదల చేసినట్లు తెలిపారు. రక్షణ రంగంలోనే కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రి సహాయాన్ని అర్థిస్తున్నామన్నారు. ప్రధాని 8వ వేతన సంఘం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని,ఆరునెలలు కావస్తున్నా నేటికీ అది అమలు కాలేదన్నారు. 2004 సంవత్సరానికి ముందు ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు అనుభవిస్తున్న పాతపెన్షన్ విధానాన్ని 2004 తర్వాత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా చేరిన అందరికీ వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశారు. ముంబై రక్షణ రంగంలో కోర్టు కేసులతో సంబంధం లేకుండా అందరికీ అన్ని అలవెన్సులు పై ఓటి చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. అలవెన్సులు అన్నింటిపై ఓటి చెల్లించాలని కోర్టులు ఆదేశించినా,అమలకు నిరాకరించి ఎన్ఎడిలో భారత రాజ్యాంగంప్రసాదించిన ప్రాథమిక హక్కులకు, మానవహక్కులకు సంస్థ అధినేత సిజిఎం భంగం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. ఒక ఉద్యోగిని సస్పెండ్ చేసి సస్పెండ్ అయిన ఉద్యోగి ఎన్ఎడి క్వార్టర్స్‌లో ఉండకూడదని, ఈ నెల 4 నుండి బహిష్కరించారన్నారు. ఎన్ఎడిలో అనేక విషయాల్లో కార్మిక హక్కులకు తీవ్రమైన భంగం కలుగుతుందని తెలిపారు. సిజిఎం ఏకపక్ష చర్యలకు పాల్పడుతున్నారన్నారు.

మహిళలపై దాడులు హేయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మద్యం, డ్రగ్స్, సోషల్ మీడియాలో అశ్లీల చిత్రాల వల్ల సమాజంలో ఏదో చోట మహిళలపై దాడులు జరుగుతున్నాయని వీటిని ప్రభుత్వాలు అరికట్టాలని రాష్ట్ర మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.ఎ బేగం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని గురజాడ జంక్షన్ లో మహిళా సమాఖ్య, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపి ప్రజా ప్రతినిధులు, ఎంపిలు కూడా మహిళపై అత్యాచారాలు చేస్తున్న ఘటనలు ఇటీవల వెలుగులోకి రావడం ఘోరం అన్నారు. వీటిని అరికట్టడంలో నేటి పాలకులు పూర్తి విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.రాంబాబు,కె.అచ్యుత్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రాష్ట్రంలో నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన ఏడాది పూర్తయినా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు చూపాలని లేదంటే నిరుద్యోగులని సమీకరించి సమరశీల పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కె. వనజాక్షి మాట్లాడుతూ అదానీ పాలసీపై నిమ్మకు నీరెత్తినట్టు ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మహిళాసమాఖ్య జిల్లా నాయకులు ఎ.దేవుడమ్మ, గాయత్రి పాల్గొన్నారు.

IN THE COURT OF THE VI ADDL. DISTRICT JUDGE, KAKINADA
M.V.O.P. No.162 / 2024

Between:
Puppala Bhanu Prasad ...Petitioner
and
Shirgham Gowri Raju & others ...Respondents

To: Respondent-2:
M/s. Sri Kannathalli Transport, rep. by **Kandregula Rambabu**, S/o. Chandrayya (late), D.No.43-21-7/B, Aseena Homes, Subbalakshmi Nagar, Visakhapatnam Urban, Visakhapatnam District - 534 001 (Owner of Lorry bearing No.**AP31TD 5588**)

పై నెంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు ద్వారా మరియు పోస్టల్ ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినను తీసుకొనక ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు మీ హాజరు నిమిత్తం **23-09-2025** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై శ్రీ కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియ పర్చుకోవలెను లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

Dr. మేడపాటి ధర్మారెడ్డి
A.U.V.స్వామి
న్యాయవాదులు, ప్రతాప్ నగర్, కాకినాడ
సెల్: 8099505050

IN THE HONOURABEL COURT OF THE JUDGE; ADDITIONAL FAMILY COURT AT VISAKHAPATNAM
F.C.O.P. 1649/2024

Between:
Ramadasu Jayalakshmi . . . Petitioner
And:
Ramadasu Babji . . . Respondent

NOTICE

To
Ramadasu Babji
S/o. late Suryanarayana
D.No 14-28 Dronamraju Colony
SC BC colony Pendurthi
Visakhapatnam-531173

Please take notice that the above OP filed against you for dissolution of marriage by a decree of divorce stands posted to **02-09-2025** for your appearance. If you have any objections you may attend either personally or through an Advocate before the above said Court at **10.30 A.M**. on **02-09-2025** failing which the matter will be decided exparte in your absence.

(By order of the Court)
MALLA TULASIRAM
Advocate
Pendurthi
Visakhapatnam
Cell: 93484 22444

Visakhapatnam,
Date: 29-08-2025

IN THE HONOURABLE COURT OF THE 2nd ADDITIONAL JUNIOR CIVIL JUDGE (MOBILE COURT) AT SRIKAKULAM.
O.S. 252/2024

Between:-
Bagathi Nageswara Rao .....Plaintiff
And:-
Bagadi Ravi Kumar .....Defendant

To,
Bagadi Ravi Kumar, S/o Rama Rao late, aged 49 years, residing at Hayathinagaram, Srikakulam Town and District Presently Working at SRI VISWA Educational Intuitions, Visakhapatnam, door no 51-81-72, Opp. Reliance Petrol Bunk, Dwarakangar, Visakhapatnam 530016.

పై నెంబర్ గల దావాలో మీరు Defendant గా ఉన్నారు. పై కోర్టు వారు మీకు ఎన్ని సార్లు నోటీస్‌లు పంపినను మీరు తీసుకొనందున మీకు నోటీసు నిమిత్తము పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తేదీ 09-10-2025న వాయిదా వేసి ఉన్నారు** సదరు పైన తెలిపిన **తేదీన 09-10-2025 ఉదయం 10:30A.M** సదరు కోర్టు వారి ముందు స్వయంగా గాని, వకీల్ ద్వారా గాని, హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయవలెను లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించడం జరుగును

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

బి. మురళీకృష్ణ
న్యాయవాది, శ్రీకాకుళం,
సెల్: 70328 34233.

ఇఒఐలను తక్షణమే రద్దు చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో యాజమాన్యం ప్రకటించిన 46 విభాగాల ఎక్స్‌ప్రెస్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఇఒఐ)లను తక్షణమే రద్దు చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ, యాజమాన్యాలు ప్రకటించిన ఇఒఐలను వ్యతిరేకిస్తూ స్టీల్ ప్లాంట్ మెయిన్ గేట్ నుండి పాత గాజువాక జంక్షన్ వరకు శుక్రవారం సాయంత్రం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదని పదేపదే చెబుతున్నా, స్టీల్ యాజమాన్యం ప్రకటించిన ఇఒఐలను సమర్థించడం ఉత్తరాంధ్ర ప్రజలకు తీరని అన్యాయమే అని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు నగరంలోనే ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు స్టీల్ ప్లాంట్‌లో వాస్తవ పరిస్థితులను విన్నవించడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. స్టీల్ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాల వల్ల స్టీల్‌ప్లాంట్‌లో అస్తవ్యస్త పరిస్థితి నెలకొందని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి స్టీల్ కార్మికుల ఆవేదనను పరిష్కరించే దిశగా తగిన చర్యలు చేపట్టే విధంగా ఆదేశించాలని కోరారు. పూర్తిస్థాయి ఉత్పత్తి చేయడానికి అవసరమైన ముడి పదార్థాలను సమకూర్చడంలో యాజమాన్యం విఫలం కావడం ద్వారా ఉత్పత్తికి అనునిత్యం అంతరాయాలు కలుగుతోందని చెప్పారు. ప్రభుత్వం దృష్టి సారించి పూర్తిస్థాయి ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలను సమకూర్చడంలో సహకరించాలని అభ్యర్థించారు. కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలను, సౌకర్యాలను కల్పించే విధంగా యాజమాన్యంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణ, పి.వి.రమణమూర్తి, గణపతిరెడ్డి, డి.వి.రమణారెడ్డి, డేవిడ్, యు.రామస్వామి, కెఎస్ఎన్.రావు, సుబ్బయ్య, ఎన్.రామారావు, కాంట్రాక్టు లేబర్ యూనియన్ ప్రతినిధులు నమ్మి రమణ, మంత్రి రవి, ప్లాంట్‌లోని వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, కార్మికులు, ఒప్పంద కార్మికులు పాల్గొన్నారు.

ర్యాలీకి ముందు సభలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పి.భీమవరం గ్రామానికి చెందిన పినపోలు కామేష్ (22) శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఓ వివాహితతో ప్రేమ వ్యవహారం ఉండడంతో ఇరు కుటుంబీకులు మధ్య పి.భీమవరం సమీపంలో శుక్రవారం పంచాయతీ నిర్వహించారు. అక్కడ ఉద్రేకానికి లోనైన కామేష్ వద్దది వెళ్లి గడ్డి మందు కొనుగోలు చేసి తాగాడు. వెంటనే కుటుంబీకులు విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట గ్రామంలో శుక్రవారం కొట్యాడ అచ్చిబాబు (45) తన నివాసంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు మద్యానికి బానిసై, తరచూ భార్యతో గొడవపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సత్యనారాయణ వెల్లడించారు.

చిట్టివలసలో 'మీకు తెలుసా'

ప్రజాశక్తి -తగరపువలస :ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యాన జివిఎంసి ఒకటో వార్డు పరిధి చిట్టివలస జెడ్‌పి హైస్కూల్‌లో 'మీకు తెలుసా' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవి, ఎయిడ్స్, టిబి, సుఖ వ్యాధులు, 2017 యాక్ట్, 1097 హెల్ప్ లైన్ నెంబర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దొడ్డి ఆదినారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మనాభంలో డిప్యూటీ కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి శుక్రవారం పర్యటించారు. రేవిడి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పద్మనాభంలోని బిసి హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్‌లోని సమస్యలనడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.ఆనందరావు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన జెడి ఫౌండేషన్

ప్రజాశక్తి-గోపాలపట్నం : ఇటీవల కురిసిన వర్షాలకు నరవ ప్రధాన రహదారి, దనుష్ కన్వెన్షన్ హాల్ ఎదురుగా పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న జెడి ఫౌండేషన్ సభ్యులు స్థానికుల సాయంతో గుంతల్లో క్రషర్ బుగ్గి వేసి చదునుచేసి రాకపోకలకు ఇబ్బందిలేకుండా చేశారు. ఈ కార్యక్రమంలో జెడి ఫౌండేషన్ సభ్యుడు కుప్పిలి నరసింహమూర్తి, సాలాది కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చుతున్న జెడి ఫౌండేషన్ సభ్యులు

నష్టపరిహారం చెల్లించేవరకూ పోరాటం

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

మాట్లాడుతున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి- పద్మనాభం : భూములకు నష్టపరిహారం చెల్లించేవరకూ పోరాటం కొనసాగించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు పిలుపునిచ్చారు. పద్మనాభం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో రైతులు చేస్తున్న భూ పోరాట శిబిరాన్ని జగ్గునాయుడు, భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి శుక్రవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఆ భూముల్లో ఉన్న జీడిమామిడి, టేకు తదితర చెట్లను పరిశీలించారు. అనంతరం జగ్గునాయుడు మాట్లాడుతూ, రైతులు ఐక్యంగా పోరాటం చేస్తే ఏదైనా సాధించవచ్చన్నారు. రైతుల భూముల్లో ఉన్న చెట్లను స్థానిక రెవెన్యూ అధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. దీనిపై అవసరమైతే కుటుంబాలతో కలిసి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపాలన్నారు. సిపిఎం రైతులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గ్రామస్థాయిలో గ్రూపులుగా విభజించి పోరాటాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతాయని, వాటిని గమనించి ఎవరికీ లొంగిపోకుండా పోరాడాలని పిలుపునిచ్చారు. రైతులకు తప్పనిసరిగా నష్టపరిహారం ఇవ్వాలని, అక్కడ పెట్టే కంపెనీలో ఆ భూమిలోని రైతుల పిల్లలకే ఉపాధి అవకాశాలు కల్పించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రాంబాబు, సూరిబాబు, అప్పలనాయుడు, అప్పలరాజు, చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్పలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి-కొమ్మాది : రాజీవ్ గృహకల్పలోని మండల ప్రాథమిక పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించి, అదే ఆవరణలో ఉన్నత పాఠశాలను కూడా ఏర్పాటుచేయాలని కోరుతూ మంత్రి నారా లోకేష్‌కు జివిఎంసి 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత శుక్రవారం వినతిపత్రం అందించారు. చంద్రంపాలెం హైస్కూల్‌కు వచ్చిన లోకేష్‌ను హేమలత కలిసి సమస్యలను వివరించారు. వార్డు పరిధిలో రాజీవ్ గృహకల్ప, మారకవలస, బోరవానిపాలెం, శారదనగర్, జెఎన్ఎన్‌యుఆర్ఎమ్, పిపి 1 కాలనీ తదితర ప్రాంతాల విద్యార్థులు హైస్కూల్ చదువు కోసం సుమారు 5 కిలోమీటర్లు జాతీయ రహదారిని దాటుకుంటూ వెళ్లాల్సి వస్తుందని, జాతీయ రహదారిని దాటే క్రమంలో చాలామంది ప్రమాదాల బారిన పడుతున్నారని, అత్యధిక జనాభా కలిగిన ఈ ప్రాంతంలో ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో నాడు -నేడు పథకంలో భాగంగా అదనపు తరగతి భవనాలు అసంపూర్తిగా నిర్మితమై ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలని కోరారు.

మంత్రి లోకేష్‌కు హేమలత వినతి

మంత్రి లోకేష్‌కు సమస్యలు వివరిస్తున్న హేమలత

చిన్న శ్రీను ప్రీమియర్ లీగ్ ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో చిన్న శ్రీను ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షులు సిరమ్మ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం సమకూరుతాయన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను ఒకేలా స్వీకరించాలని సూచించారు. ఈ పోటీలు ఈ నెల 4వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.15 వేలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో భీమిలి ఎంపిపి వాసురాజు, పార్టీ మండల అధ్యక్షులు గాడు శ్రీను, దాకమర్రి ఎంపిటిసి చెల్లూరి నగేష్‌బాబు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న సతీష్‌రెడ్డి

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్నను డిఆర్‌డిఒ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు స్వాగతం పలికి, ఆలయ ఆచార సంప్రదాయాల ప్రకారం దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ముందుగా సతీష్‌రెడ్డి స్వామివారి కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, అనంతరం శ్రీ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ వర్గాల తరపున శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి బరువు సత్య శ్రీనివాస్, దేవస్థానం పిఆర్ఓ నాయుడు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు వద్దంటూ ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

కొమ్మాది : అదాని విద్యుత్ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టడం అంటే ప్రజలను వంచించడమేనని సిపిఎం నాయకులు డి.అప్పలరాజు అన్నారు. జివిఎంసి 5వ వార్డు పరదేశిపాలెం కొండ ప్రాంతంలో శుక్రవారం పాదయాత్ర నిర్వహిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.కొండమ్మ, ఎ.గురుమూర్తిరెడ్డి, బి.భారతి, కె.సుజాత, కనకరాజు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : వినియోగదారులపై తీవ్ర ఆర్థిక భారాలు మోపే స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు పిలుపునిచ్చారు. శుక్రవారం టౌన్ కొత్త రోడ్డులోని విద్యుత్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ముఠా కళాసీల యూనియన్ అధ్యక్షులు పైడిరాజు, సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-మధురవాడ : మహిళల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న వివిధ పథకాలను, చట్టాలను వైద్యులు విధిగా అనుసరించాలని, ముఖ్యంగా ప్రసూతి సమయంలో మహిళల ఆరోగ్యంపై అవగాహన కలిగించాలని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి చెప్పారు. జిమ్సర్ గైనకాలజీ విభాగం ఆధ్వర్యాన 'జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, చట్టాలు -2025' అంశంపై వైద్యులకు నిరంతర వైద్య విద్యా బోధన (సిఎమ్ఇ) కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. జననీ శిశు సురక్ష కార్యక్రమం, జననీ సురక్ష యోజన ప్రధాన మంత్రి మాతృ వందన యోజన వంటి పథకాలు మహిళలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడానికి కృషిచేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమ నిర్వాహక చైర్‌పర్సన్, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ, గర్భిణులకు అండగా గీతం ఆసుపత్రి పదేళ్ల నుంచి సావిత్రి ప్రసూతి పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకంలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 2908 మంది మహిళలు తమ పేర్లను నమోదు చేసుకోగా వారిలో 1344 మందికి ప్రసవం పూర్తయ్యేంత వరకు అన్ని సేవలను సురక్షితంగా, ఉచితంగా అందించామని తెలిపారు. జిమ్సర్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎస్.పి.రావు మాట్లాడుతూ ప్రసూతి సేవలను అందించడంలో వైద్యులు అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.గీతాకుమారి, డాక్టర్ కె.కార్తిక్ బోగవల్లి పాల్గొన్నారు.

కృష్ణాపురంలో పొలంబడి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఎం.వెంకటాచలం ఆధ్వర్యాన పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. భీమిలి వ్యవసాయ శాఖ ఎడిఎ విజయ్‌కుమార్ పాల్గొని సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. సేంద్రియ వ్యవసాయం వల్ల అధిక దిగుబడులతో పాటు వ్యవసాయానికి రసాయన ఎరువుల వాడకం తగ్గుతుందని, దానివల్ల పంటకు నష్టం కలుగకుండా ఉంటుందని వివరించారు. చీడపీడలు ఆశించవని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కోరమాండల్ మన గ్రోమోర్ వారి మెటా నానో డిఎపి, మెటా నానో యూరియాపై డెమో ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మన గ్రోమోర్ సెంటర్ సిబ్బంది, ఏరియా మేనేజర్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎఐ ల్యాబ్‌లు ప్రారంభం

ప్రజాశక్తి-మధురవాడ : సెయింట్ ఫౌండేషన్ సహకారంతో విశాఖ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) ల్యాబ్‌లను రుషికొండ సమీపంలోని రాడిసన్ బ్లూ హోటల్ నుంచి రాష్ట్ర మానవ వనరులు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం సెయింట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బివిఆర్.మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ, ఎఐ ల్యాబ్‌లో ఏర్పాటులో సెయింట్ ఫౌండేషన్ కృషి అభినందనీయమన్నారు. ప్రపంచం సాంకేతికతలో పోటీపడుతున్న ఈ తరుణంలో ఆంధ్రప్రదేశ్ నుంచి టెక్నాలజీ రంగంలో నిష్ణాతులైన వారిని తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో భవిష్యత్తులో విస్తరిస్తామన్నారు. ఐటీ పరిశ్రమల కేంద్రంగా విశాఖలో అనేక సంస్థలు ఏర్పాటవుతున్న తరుణంలో ప్రస్తుత యుగానికి అవసరమైన 21వ శతాబ్దపు పోటీ తత్వాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల పేద విద్యార్థులకు ఎఐని అందించడం గొప్ప విశేషంగా అభివర్ణించారు. ప్రస్తుతం 50 స్కూళ్లతో విశాఖలో ప్రారంభమవుతున్న ఈ కార్యక్రమం ద్వారా 25 వేల మంది విద్యార్థులు లబ్ధిపొందుతారని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు.

సెయింట్ ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ బివిఆర్.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లపాటు ఈ కార్యక్రమం తమ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో కొనసాగుతుందని చెప్పారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో బోధించే రీతిలో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఉన్నత పాఠశాలలో ఏడు నుంచి పది తరగతుల విద్యార్థులకు డిజిటల్ శిక్షణ ఎఐ, స్టెమ్, రోబోటిక్స్ విభాగాలలో తర్ఫీదునిచ్చేందుకు అవసరమైన కంప్యూటర్లు, బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ ఇతర మౌలిక వసతులు సమకూర్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు,

ఎఐ ల్యాబ్‌లను ప్రారంభిస్తున్న మంత్రి నారా లోకేష్

ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకు ముందు చంద్రంపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి చేసిన పూర్తి స్థాయి ఎఐ ల్యాబ్‌ను మంత్రి లోకేష్ ప్రారంభించారు. స్థానిక పాఠశాలలో విద్యా ప్రమాణాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవి, గాదె శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫిల్మ్‌నగర్ భూ కేటాయింపుపై లోకేష్ హామీ

ప్రజాశక్తి -మధురవాడ : వైజాగ్ ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ భూ కేటాయింపు దస్త్రంలో దొర్లిన పొరపాటు సరి చేస్తామని ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. మధురవాడ వి కన్వెన్షన్‌లో ఫిల్మ్ నగర్ ప్రతినిధులు శుక్రవారం లోకేష్‌ను కలిశారు. ఫిల్మ్ ఇండస్ట్రీ విశాఖ రావాలనే ఉద్దేశంతో 2015లో ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్‌కు చంద్రబాబు శంకుస్థాపన చేశారని చెప్పారు. తిమ్మాపురం రామానాయుడు స్టూడియో వద్ద 5 ఎకరాల భూమిని లీజు పద్ధతిన ఏడాదికి రూ.10 లక్షలకు కేటాయించారని, అయితే లీజు గడువును ఆ ఉత్తర్వుల్లో ఎక్కడా పేర్కొనకపోవడంతో సాంకేతిక సమస్య వచ్చిందని, దీనిపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇప్పటికే తనతో మాట్లాడారని, లీజు గడువును నిర్దేశిస్తూ 5 ఎకరాల భూమిని కేటాయిస్తామని లోకేష్ ప్రకటించారు. లోకేష్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు చంద్రమౌళి ప్రసాద్ (కిన్ను), కోశాధికారి బాలాజీ, కమిటీ ప్రతినిధులు శ్రీహరి, హరివర్మ ఉన్నారు.

61వ వార్డులో డ్రైడే - ఫ్రైడే

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 61వ వార్డు పరిధి ప్రకాష్‌నగర్ ఏడుగుళ్ల కూడలి వద్ద శుక్రవారం మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ ఆధ్వర్యాన డ్రైడే - ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జోన్ - 5 కమిషనర్ బి రాము, బయాలజిస్టులు దాడి సాంబమూర్తి, వరప్రసాద్ రెడ్డి హాజరై మాట్లాడారు. డెంగీ, మలేరియా, చికున్‌గునియా తదితర సీజనల్ వ్యాధులను వ్యక్తిగత పరిశుభ్రతతోనే నివారించవచ్చన్నారు. పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి భద్రత అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఇంటిలోని ట్యాంకులు, కుండీలను వారానికి రెండు రోజులు శుభ్రపరుస్తూ ప్రతి శుక్రవారమూ డ్రైడేను పాటించి దోమల వృద్ధిని అరికట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూపర్‌వైజర్ జనార్దన్, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, టిడిపి నాయకులు మజ్జి సోమేష్, కాకి పోలిరెడ్డి, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, జనసేన నాయకులు నడిగట్ల శంకరమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రమేష్, నవరత్నం తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ జిల్లాలో యాంటీ టొబాకో సిగ్నేజ్ ప్రచార కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన మెరిట్ విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ హరిక స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. విద్యార్థులు తమ సృజనాత్మకతతో, సామాజిక బాధ్యతతో పాఠశాలలు, సమాజంలో ధూమపాన వ్యతిరేక సందేశాన్ని ప్రచారం చేశారు. వారికి గుర్తింపు కల్పించడానికి ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

మానసికోల్లాసానికి సంగీతం దోహదం

ప్రజాశక్తి -ములగాడ : మానసికోల్లాసానికి సంగీతం ఎంతగానో దోహదపడుతుందని 'వనితా నీ స్వరానికి వందనం' అధినేత, రాయల్ సక్సెస్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆంధ్రప్రదేశ్ చీఫ్ కో-ఆర్డినేటర్ కిరణ్ పేర్కొన్నారు. కిరణ మధుర స్వరాలు ఆధ్వర్యాన 1955 నుండి 2025 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కొందరు మహిళా సింగర్లతో ఒక వేదికపైన నాలుగు ప్రపంచ రికార్డుల కోసం ప్రోగ్రామ్‌ను శ్రీనగర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. దీనికి సంబంధించిన సక్సెస్ మీట్‌కు ముఖ్యఅతిథిగా సినీ గేయ రచయిత జానకిపుత్ర దిలీప్ హాజరై మాట్లాడారు. రాయల్ సక్సెస్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, 21 సెంచరీ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యుఎస్ఎ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో వనితా నీ స్వరానికి వందనం చోటు దక్కించుకోవడం ఎంతో గర్వకారణం అన్నారు. అనంతరం కిరణ్ మధుర స్వరాలు సంస్థ అధ్యక్షులు కిరణ్‌కు వైజాగ్ సబ్ కో-ఆర్డినేటర్ వై.సూర్యప్రభకు రాయల్ సక్సెస్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను, 21 సెలబ్రేషన్ బుక్ ఆఫ్ రికార్డ్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. గాయకులందరికీ ప్రపంచ రికార్డు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు.

మహిళా గాయకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

రుషికొండ భవనాలను పరిశీలించిన పవన్ కల్యాణ్

రుషికొండ భవనాలను పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్ తదితరులు

ప్రజాశక్తి-మధురవాడ : రుషికొండ వద్ద గత ప్రభుత్వం నిర్మించిన భవనాలను డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇక్కడ 7 బ్లాక్‌లకు 4 మాత్రమే కట్టి, రూ.454 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. గతంలో వాటిని చూసేందుకు తమను రానివ్వలేదని, ఎన్నో అడ్డంకులు సృష్టించారని తెలిపారు. భవనాలకు లోపల పెచ్చులు ఊడిపోతున్నాయని, కొన్ని చోట్ల లీకేజీ అవుతుందని వివరించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నివాసం ఉండడానికే వీటిని కట్టారన్నారు. దీనిని టూరిజం కింద ఎలా చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. భవనాలు దుమ్ము, ధూళితో ఉన్నాయని, శుభ్రం చేయించాలని చెప్పారు. అత్యాధునిక బెడ్ రూమ్స్, బాత్ రూమ్స్ చూసి ఆశ్చర్యం కలిగిందన్నారు.

గతంలో హరిత రిసార్ట్స్ ఉన్నప్పుడు సంవత్సరానికి రూ.7 కోట్లు ఆదాయం వచ్చేదని తెలిపారు. ఇప్పుడు నిర్వహణకు రూ. కోటి బకాయి పడినట్లు చెప్పారు. కేవలం కరెంట్ బిల్లు సంవత్సరానికి రూ.15 లక్షలు అవుతుందని తెలిపారు. రుషికొండ భవనాలపై అసెంబ్లీ వేదికగా చర్చ జరగాలన్నారు. భవనాలు నిర్మించినప్పుడు రుషికొండపై తవ్విన మట్టిని కూడా గత ప్రభుత్వం సొమ్ము చేసుకుందని ఆరోపించారు.

31న ప్రతిభావంతులకు పట్టాభిషేకం

ప్రజాశక్తి-సీతమ్మధార : కళా క్రీడా సాంస్కృతిక సంస్థ 25వ వార్షికోత్సవ కళా సంబరాలను పురస్కరించుకుని 'ప్రతిభావంతులకు పట్టాభిషేకం' కార్యక్రమాన్ని ఈ నెల 31వ తేదీన పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్ వరే నాంచారయ్య, వ్యవస్థాపక కార్యదర్శి ప్రతిభ అడవిరాజు తెలిపారు. కంచర్ల యశ్వంత్‌బాబు కళా ప్రాంగణం పేరున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన కళాకారులకు, ప్రముఖులకు అవార్డుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అనేక రంగాల్లో నిష్ణాతులైన గురువులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గురుశ్రేష్ఠ అవార్డు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ సేవారత్న పేదలపాలిటి 8 మదర్ తెరిసా సేవా రత్నం, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సేవ రత్న అవార్డులు, ప్రతిభారత్న, ప్రతిభ బాలరత్న, ప్రతిభ విజ్ఞానరత్న, ప్రతిభ నటరత్న అవార్డులను ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

రిటైర్డ్ ఉద్యోగులను నియమించే నిర్ణయాన్ని రద్దు చేయాలి

-డివైఎఫ్ఐ డిమాండ్

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రైల్వేలో లోకో పైలెట్ వంటి పోస్టులకు ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని తిరిగి నియమించాలనే రైల్వే బోర్డు నిర్ణయాన్ని రద్దు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిజిల్ లోకో షెడ్ వద్ద శుక్రవారం రైల్వే కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకో పైలెట్, అసిస్టెంట్ లోకో పైలెట్ వంటి పోస్టులకు ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని తిరిగి తీసుకుంటే, యువతకు నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటికే రైల్వేలో మూడు లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేయకుండా బిజెపి ప్రభుత్వం రైల్వేను నాశనం చేస్తోందని విమర్శించారు. ఏటా 4 వేల మందికి పైగా 50 వేల మందికి పైగా రైల్వే ఉద్యోగులు విరమణ చేస్తున్నారని, దీని వల్ల రైల్వేలో ఉద్యోగుల సంఖ్య బాగా తగ్గుతుందని తెలిపారు. ప్రస్తుతం భారతీయ రైల్వేలో లక్షల ఖాళీలు ఉన్నాయని, వీటిలో 33 వేలు కంటే ఎక్కువ రన్నింగ్ స్టాఫ్ పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు.

సేఫ్టీ కేటగిరీ పోస్టులను ఎప్పుడూ ఖాళీగా ఉంచకూడదని, కొత్త రైళ్లను ప్రవేశపెట్టినప్పుడల్లా తగినంత సిబ్బందిని మంజూరు చేయాలని హై లెవల్ సేఫ్టీ రివ్యూ కమిటీ (2012), నిపుణుల కమిటీలు స్పష్టంగా సిఫార్సు చేసినప్పటికీ రైల్వే బోర్డు రోజువారీ వేతనంతో కూడిన రైళ్లను నడపడానికి తిరిగి నియమించే తిరోగమన మార్గాన్ని ఎంచుకుందని, ఇది ప్రయాణీకుల భద్రతకు హాని కలిగించే చర్య అని పేర్కొన్నారు. నియామక అవకాశాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతను అవమానించే చర్య అన్నారు. దీనిని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) వ్యతిరేకిస్తుందన్నారు. ఖాళీ పోస్టులు భర్తీ చేసి కార్మికుల మీద పని ఒత్తిడి తగ్గించాలని, లోకో పైలెట్ల మీద ఎక్కువ సమయపు డ్యూటీల భారాన్ని తగ్గించాలని, రైల్వే నియమాలు మార్పుచేసి రైలు ప్రమాదాలను నివారించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో బోలేనాథ్, చినబాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-గోపాలపట్నం : జివిఎంసి 90వ వార్డు పరిధి విమానగర్ డబుల్ రోడ్డులో కాలనీవాసులు ఏర్పాటుచేసిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబుతో కలిసి విశాఖ ఎంపీ శ్రీభరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో ఎన్‌టిఆర్ ముందు వరసలో ఉంటారని అన్నారు. అటువంటి మహనీయుని విగ్రహం ఇక్కడ ఏర్పాటుచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, టిడిపి నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

మోసం కేసులో మూడేళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి- లీగల్ : పూర్వ వివాహాన్ని దాచిపెట్టి, పెద్ద ఎత్తున కట్నం, బహుమతులు తీసుకొని మోసం చేసిన వ్యక్తికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానాను విధిస్తూ ఒకటవ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పి.ప్రదీప శుక్రవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల సాధారణ శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. బాధితురాలిని మోసం చేసినందుకు మరో సంవత్సరం కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధించారు. కేసుకు సంబంధించి ప్రత్యేక ప్రజా అభియోజకురాలు (ఎపిపి) కె.విమల రాథోర్ తెలిపిన వివరాలిలావున్నాయి... పెందుర్తికి చెందిన యల్లంకి అప్పల రామ్మూర్తి (45) తన పూర్వ వివాహాన్ని దాచిపెట్టి, బాధితురాలు వెంకటలక్ష్మిని 2010 నవంబర్ 12వ తేదీన వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత బాధితురాలిని శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. దీంతో బాధితురాలు వై.వెంకటలక్ష్మి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళా ఎస్ఐ కృష్ణకుమారి దర్యాప్తు చేసి, చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్‌లో నిందితుడు నేరం చేసినట్లు నిరూపితం కావడంతో పైవిధంగా శిక్షిస్తూ తీర్పు వెల్లడించారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు

ప్రజాశక్తి-సీతమ్మధార : వినాయక చవితి మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యుత్ సిబ్బందికి ఆదేశాలు జారీచేసినట్లు విశాఖపట్నం సర్కిల్ ఎస్ఇ జి.శ్యాంబాబు తెలిపారు. విద్యుత్ శాఖ సూచనలను పాటించి గణేష్ ఉత్సవాలను సురక్షితంగా జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా కోసం అధికారిక కనెక్షన్లు మాత్రమే తీసుకోవాలని, విద్యుత్ దొంగతనం ప్రమాదకరం, చట్టవిరుద్ధం అని, లైసెన్స్ ఉన్న ఎలక్ట్రీషియన్లు, విద్యుత్ పనులు లైసెన్స్ పొందిన ఎలక్ట్రీషియన్లు, నిపుణుల ద్వారా చేయించాలని పేర్కొన్నారు. తెగిన, సడలిన వైర్లు జాయింట్లు వాడరాదని, ఇన్సులేషన్ టేప్‌తో కవర్ చేయాలని తెలిపారు.

విద్యుత్ అమర వీరుల స్ఫూర్తితో

స్మార్ట్ మీటర్లపై పోరాటం

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

అమరవీరులకు నివాళులర్పిస్తున్న కోటేశ్వరరావు, కార్మికులు

ప్రజాశక్తి-పరవాడ : విద్యుత్ అమర వీరుల స్ఫూర్తితో విద్యుత్ స్మార్ట్ మీటర్లపై పోరాటం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. విద్యుత్తు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమర వీరులకు శుక్రవారం లంకెలపాలెం జంక్షన్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ 2000 సంవత్సరంలో నిర్వహించిన చలో హైదరాబాద్ సందర్భంగా చంద్రబాబు ప్రభుత్వం చేసిన కాల్పుల్లో సత్తెనపల్లి రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి అమరులయ్యారని, ఈ సంఘటన జరిగి 25 సంవత్సరాలు పూర్తయిందని చెప్పారు. ఆనాటి పోరాటం ప్రజలపై భారాలు పడకుండా విజయం సాధించినట్లు తెలిపారు. నేడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మళ్ళీ విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చిందని, దానికి తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు బలహీన, మధ్య తరగతి ప్రజలపై స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్తు భారాలు మోపుతుందని పేర్కొన్నారు. తక్షణమే స్మార్ట్ మీటర్లను ఉపసరించుకోవాలని, లేదంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గనిశెట్టి సత్యనారాయణ, అప్పారావు, వెంకట్రావు, గంగరాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : విద్యుత్తు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గురువారం అచ్యుతాపురం, పూడిమడక గ్రామాలలో సిపిఎం ఆధ్వర్యంలో అమరవీరులు సత్తెనపల్లి రావకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము, సభ్యులు కె.సోమునాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండి అని పిలుపునిచ్చిన లోకేష్, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అవే స్మార్ట్ మీటర్లు బిగించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో పూడిమడక శాఖ కార్యదర్శి చేపల తాతయ్య, దుర్గ, సోములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : విద్యుత్ అమరవీరులు స్ఫూర్తితో స్మార్ట్ మీటర్ల రద్దుకు పోరాడాలని ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి పిలుపునిచ్చారు. ఐద్వా షీలానగర్ ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో బషీరాబాగ్ వద్ద పోలీసులు జరిపిన కాల్పుల్లో అసువులు బాసిన అమరవీరులకు నివాళులర్పిస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జోన్ నాయకులు సంతోషం, జి.మణి, సునీత బేబీ, అడ్వకేట్ మల్లిక, మానస, వందన, విన్ని, కమలమ్మ పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ఐద్వా నాయకులు

ములగాడ : జివిఎంసి 58వ వార్డు పరిధి గుల్లలపాలెం, 59వ వార్డు పరిధి నెహ్రునగర్, ములగాడ హౌసింగ్ కాలనీలో జివిఎంసి ముఠా కార్మికుల ఆధ్వర్యాన విద్యుత్ ఉద్యమ అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి. పైడిరాజు, నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, బూడి శ్రీను, కె.పెంటారావు, సత్యారావు, జె.రామునాయుడు, దున్న రాజేష్, రామకృష్ణ, ప్రశాంత్, సురేష్, హేమంతు ఈశ్వరరావు, శ్రీను, పైడినాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రతిజ్ఞ చేస్తున్న సిపిఎం నాయకులు

పోలీసు సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

పోలీసుల సమస్యలను పరిష్కరిస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి-అనకాపల్లి : పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం "పోలీస్ వెల్ఫేర్ డే" కార్యక్రమం నిర్వహించారు. సిబ్బందిని వ్యక్తిగతంగా పిలిపించి, వారి విజ్ఞాపనలను స్వీకరించారు. వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను ప్రత్యక్షంగా విన్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమమే తమ ప్రాధాన్యమని చెప్పారు. ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారం అయ్యే వరకు కృషి చేస్తామన్నారు.

డ్రోన్‌తో పిచికారీని ప్రారంభిస్తున్న వ్యవసాయాధికారులు

డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలో పెద్దగుమ్ములు గ్రామంలో శుక్రవారం డ్రోన్ ద్వారా వరి పంటలకు నానో యూరియా పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సౌజన్య మాట్లాడుతూ డ్రోన్ వల్ల వ్యవసాయం సులభంగా చేయొచ్చని తెలిపారు. రసాయన ఎరువులు తగ్గించి పర్యావరణ పరిరక్షణ నిల్వ, రవాణా సులభతరంగా చేతవచ్చని, కనుక రైతులు డ్రోన్ సర్వీసులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు జాహ్నవి, టిడిపి మండల అధ్యక్షులు అబద్ధం, కుర్ర రామకృష్ణ, అల్లు నరసింహమూర్తి, గాడి అప్పలనరసింహనాయుడు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుకు పుష్ప గుచ్ఛం ఇస్తున్న తాతయ్యబాబు

ముఖ్యమంత్రిని కలిసిన తాతయ్యబాబు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమానికి శుక్రవారం విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల భిక్షాటన

ప్రజాశక్తి-సబ్బవరం : స్త్రీ శక్తి పథకం అమలు కారణంగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరుతూ స్థానిక దుర్గమాంబ ఆటో యూనియన్ ఆధ్వర్యాన మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం భిక్షాటన చేశారు. తమ ఆటోలకు బేరాలు లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామంటూ ఆటో స్టాండ్ డ్రైవర్లు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పెనగంటి రామసత్యనారాయణ, బోకం వెంకటరమణ, రేసుపూడి లక్ష్మణరావు, కంద కనకరాజు, గవర లక్ష్మణరావు మాట్లాడుతూ మండలంలో 15 ఆటో స్టాండ్లలో 350 ఆటోలు ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటోలకు బేరాలు లేక వీరి కుటుంబాలు రోడ్డున పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం కింద ఏడాదికి రూ.20 వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్రాడ శ్రీను, సబ్బవరపు శివ, కరణం ప్రసాద్, వెన్నెల వెంకి నాయుడు, వంకర నూకరాజు, దుంగ నూకరాజు, ఎన్. రాజు, వల్లభాయి తదితరులు పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

మాట్లాడుతున్న విఎంఆర్‌డిఎ అధికారులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామాల్లో వేసిన అనధికార లే-అవుట్లను క్రమబద్ధకరించుకోవాలని విఎంఆర్‌డిఎ అధికారులు కోరారు. ఈ మేరకు అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణపై పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు శుక్రవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో విఎంఆర్‌డిఒ ప్లానింగ్ అధికారులు అవగాహన కల్పించారు. మండలంలో ఎక్కడెక్కడ అనాధికార లేఅవుట్లు ఉన్నాయో వాటి స్థితిగతులపై చర్చించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్లానింగ్ అధికారులు వి సూర్యనారాయణ, బి శ్రీనివాసరావు మాట్లాడుతూ లేఅవుట్‌లో ప్లాట్లు క్రమబద్ధీకరణ పథకం 2020ను పొడిగిస్తూ ప్రభుత్వం సవరణ ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. అనధికార లేఔట్లలో ఈ సంవత్సరం జూన్ 30 లోపు ప్లాట్ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్నవారు ఆన్లైన్ పోర్టల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. క్రమబద్ధీకరణ వల్ల భవన అనుమతులు, విద్యుత్, నీటి సరఫరా ఇతర ప్రభుత్వ సౌకర్యాలు లభిస్తాయని పేర్కొన్నారు. చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్లు బ్యాంకు రుణాలు పొందవచ్చని తెలిపారు. ప్లాట్ యజమానులకు పూర్తి అవగాహన కలిగించాలని కార్యదర్శులను వీఆర్వోలను ప్లానింగ్ అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ప్లానింగ్ అధికారి ఏ సునీత, విఎంఆర్‌డిఎ సర్వేయర్ ఎ.గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశం కల్పించినట్లు విఎంఆర్‌డిఎ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో అనేకచోట్ల అనధికార లేఅవుట్లు ఉన్నాయని, వాటిని గుర్తించి వారంతా క్రమబద్ధీకరించుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఎంఆర్‌డిఏ అధికారులు వి.సూర్యనారాయణ, ఎ.సునీత, గిరిధర్, మండల డిప్యూటీ ఎంపీడీవో అర్జున్ రావు, చీడికాడ మండల ఇఒపిఆర్‌డి చంద్రశేఖర్, కార్యదర్శులు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండలంలోని ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శుక్రవారం మాజీ శాసనసభ్యులు పీలా గోవిందా సత్యనారాయణ పంపిణీ చేశారు. 27మందికి 14లక్షల 90వేల రూపాయిలు సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. కన్నూరుపాలెం గ్రామానికి చెందిన చుక్కా వెంకట ప్రసాద్‌కు 1లక్షా 10వేలు, అడ్డాంకు చెందిన రెడ్డి లక్ష్మికి 1లక్షా 20వేలు, తాళ్లపాలెంకు చెందిన ముగ్గురుకి 80వేలు, ఏఎస్.పేటకు చెందిన రాయ శివాజీకీ రూ.2లక్షల 40వేలు చెక్కులను లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా పీలా గోవింద మాట్లాడుతూ అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలను ఆదుకోవడం కోసమే సీఎం సహాయ నిధి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొంతిన శ్రీనివాసరావు, వేగి గోపికృష్ణ, ఉగ్గిన రమణమూర్తి, కాయలు మురళి, ఉల్లింగల రమేష్, కూండ్రపు రామునాయుడు, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి నేత రవికుమార్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సబ్బవరం : వైసిపి పెందుర్తి నియోజకవర్గం సీనియర్ నాయకులు గండి రవికుమార్ జన్మదిన వేడుకలు గండి రవికుమార్ యువ సైన్యం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని గొట్టివాడ గ్రామంలో జనరేషన్ యువ అనాథశ్రమంలో విద్యార్థులకుకు అల్పాహారం అందజేశారు. బహుమతులను ప్రదానం చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెందుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. సరిపల్లిలో ఉన్న శ్రీదుర్గాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పెందుర్తి రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న లోయోల అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్నం భోజనాలు అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు కర్రి బాబు, సర్పంచ్‌లు దేడ్డం ప్రసాదరావు, వడ్డాది అప్పలరాజు, బలిరెడ్డి కనకరాజు, బోనునాయుడు, బండారు శ్రీను, నేబర్తి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు గొర్లి కనకరాజు, గవర రాజు, వైసిపి నాయకులు బుదిరెడ్ల రామకృష్ణ , కోన సంజీవరావు, ధనిమిరెడ్డి శ్రీనివాసరావు, గొరపల్లి సాంబ, రామారావు, కుమార్, ప్రసాద్, సూరిబాబు, మహాలక్ష్మినాయుడు, బాలాజీ, బోలెం రాజు, రామచంద్రరావు, యడ్ల నాయుడు, సిరపరపు వాసు, అభిమానులు, పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న దృశ్యం

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ హైమావతి

శత శాతం లక్ష్యాలను సాధించాలి

ప్రజాశక్తి-మునగపాక : వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న అన్ని కార్యక్రమాలు శత శాతం పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.హైమావతి ఆదేశించారు. మండలంలోని నాగులాపల్లి-2 విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. గ్రామంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజలందరికీ ఫ్రైడే డ్రై డే గురించి, దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ నివారణ చర్యలు, దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కలగజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. గ్రామంలో అంగవైకల్యంతో బాధపడుతున్న ఒక చిన్నారిని పెన్షన్ వెరిఫికేషన్ కొరకు సందర్శించి పరిశీలించారు. తల్లితో మాట్లాడి చిన్నారి అనారోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. డాక్టర్ వినోద్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ ఎం.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బలరాముని జయంతి వేడుకలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల కేంద్రంలోన నూకంబికా మహిళా రైతు ఉత్పత్తదారుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బలరాముని జయంతి వేడుకలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షులు ఎంవివి సత్యనారాయణ బలరాముని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బుచ్చయ్యపేట పిఎసిఎస్ చైర్మన్ దొంకిన అప్పలనాయుడు, సర్పంచ్ సుంకర లక్ష్మి, పెదిరెడ్ల మాణిక్యం, ముచ్చకర్ల తాతీలు, ఎంపీటీసీ కంచిపటి శ్రీనివాస్, సంఘ చైర్మన్ ముచ్చకర్ల గంగ లక్ష్మి, సిఈఓ ఎం.రూపా, అకౌంటెంట్ ఎం.సాయి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వైఎస్.షర్మిలను కలిసిన కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : విజయవాడ ఆంధ్రరత్న భవనంలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలను శుక్రవారం జిల్లా కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఓబీసీ కాంగ్రెస్ స్టేట్ చైర్మన్ శొంఠి నాగరాజు ఆధ్వర్యంలో జిల్లా ఓబీసీ చైర్మన్లు, రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శులు కలిశారు. ఈ సమావేశంలో ఓబీసీ కాంగ్రెస్ బలోపేతానికి సంబంధించిన అనేక ముఖ్య అంశాలపై చర్చించారు. రాబోయే నెల మొదటి వారంలో రాష్ట్రవ్యాప్తంగా ఓబీసీ కాంగ్రెస్ కార్యనిర్వాహక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అనకాపల్లి జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ, అనకాపల్లి జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు పోలమర శెట్టి ఆదిమూర్తి పాల్గొన్నారు.

వైఎస్.షర్మిలతో జిల్లా కాంగ్రెస్ నాయకులు

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ధ్యాన్ చంద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎఎంఎఎల్ అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో శుక్రవారం కళాశాల గవర్నింగ్ బాడీ అధ్యక్షులు శ్రీధరాల కృష్ణ పేర్రాజు, కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయబాబు ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం క్రీడల్లో విజయం సాధించిన క్రీడాకారులకు మెమెంటో, సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో గవర్నింగ్ బాడీ సభ్యులు వాసిరెడ్డి బాలకృష్ణ, ఉదగిరి కృష్ణ కిషోర్, కాండ్రేగుల రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్ కుమార్, సూపరింటెండెంట్ పి.అనురాధ, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ కెవిఎస్.నాయుడు, కే. శత్రుజ్ఞుడు పాల్గొన్నారు.

మండలంలోని మామిడిపాలెం జెడ్పి హైస్కూల్‌లో మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హెచ్‌బి.శ్రీధర్, ఉపాధ్యాయులు బాబు, గొంది చినబ్బాయ్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగమణి, ఈశ్వర్ బాబు లక్ష్మి, పాల్గొన్నారు.

కోటవురట్ల : మాకవరపాలెం మండలం అవంతి ఇంజనీరింగ్ కళాశాల వద్ద శుక్రవారం క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ నేషనల్ బాక్సింగ్ ప్లేయర్ వై.దివాకర్, కరెక్ట్ శిక్షకులు వై నారాయణరావులను సాలువతో సత్కరించారు. కరాటే పోటీల్లో విజయం సాధించిన జి జ్యోతి, వై.దివాకర్‌కు నగదు బహుమతి అందజేశారు. కళాశాల ఈవో డానియల్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కళాశాల నుండి యూనివర్సిటీ, ఉన్నత స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టగ్ ఆఫ్ వార్, వాలీబాల్ ఆటలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.తిరుపతిరావు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక బాలుర హైస్కూల్‌లో క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు ఆటలు పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం ఎంఆర్‌వి.అప్పారావు, ఉపాధ్యాయలు ప్రసాద్, రవి, వ్యాయం ఉపాధ్యాయలు పి.కమల, పి.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

నక్కపల్లి : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హాకీ క్లబ్ కార్యదర్శి కొల్నాటి తాతాజీ, క్రీడాకారులు సమక్షంలో మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్స్ పండ్లు పంపిణీ చేశారు. పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఇటీవల హాకీ టోర్నమెంట్‌లో విజయాలు సాధించిన హాకీ క్రీడాకారులను హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, మాజీ క్రీడాకారుడు రామచంద్రరావు, కోచ్ రాంబాబు, కొల్నాటి నానాజీ, అడ్డూరి రజిత్, శివాజీ తదితరులు అభినందనలు తెలియజేసారు.

సీనియర్ క్రీడాకారులను సత్కరిస్తున్న అవంతి ప్రతినిధులు

కశింకోటలో కుస్తీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆనందపురం : హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆగస్టు 21 నుంచి 28 వరకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాస్కెట్‌బాల్, టెన్నికాయిట్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎన్.ప్రసాదరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్, సిఎంఒ డాక్టర్ పిఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.

విజ్ఞాన విహార గుడిలోవ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. 46వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెలలో వెండి పతకాలు సాధించిన మద్దిలపాలెం ఆర్‌టిసి డిపో కండక్టర్ కె.రాంబాబును సన్మానించారు.

వినాయక మండపాల వద్ద

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి-అనకాపల్లి, చోడవరం

వినాయక చవితి మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక భద్రతా జాగ్రత్తలు పాటించాలని ఎపిఇపిడిసిఎల్ అనకాపల్లి సర్కిల్ ఎస్ఈ జి.ప్రసాద్, చోడవరం ఏడి వై.సురేష్ కుమార్ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశాల మేరకు మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యుత్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. మండపాల నిర్వాహకులు తాత్కాలిక విద్యుత్ సరఫరా కోసం అధికారిక కనెక్షన్లు మాత్రమే తీసుకోవాలని, అనధికారిక కనెక్షన్లు లేదా విద్యుత్ దొంగతనం ప్రమాదకరం, చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. విద్యుత్ పనులు లైసెన్స్ పొందిన ఎలక్ట్రీషియన్లు, నిపుణుల ద్వారా మాత్రమే చేయించాలని సూచించారు. తగిన సామర్థ్యం ఉన్న ఫ్యూజ్ వాడాలని, ఓవర్ లోడ్ అయ్యేంత ఎక్కువ పరికరాలు ఒకే లైన్లో పెట్టకూడదని, డిస్ట్రిబ్యూషన్ బోర్డు పెట్టి, అందులో ఎంసిబి/ ఈఎల్‌సిబి తప్పనిసరిగా అమర్చాలని, వాటర్‌ప్రూఫ్ ఉండాలని కోరారు. ఐఎస్ఐ ప్రమాణాలు ఉన్న వైర్లు మాత్రమే వాడాలని, అన్ని వైర్లు సరిగ్గా ఇన్సులేషన్ టేప్‌తో కవర్ చేయాలని సూచించారు. ప్రతి మండపానికి ప్రత్యేక ఎర్తింగ్ ఉండాలని, మల్టీ-ప్లగ్ ఓవర్ లోడింగ్‌ను నివారించాలని స్పష్టం చేశారు. ఎల్ ఈడి లైట్లు వాడాలని, లైట్లు, సీరియల్ సెట్ వైర్లు గోడలకు, లోహ వస్తువులకు నేరుగా తగలకుండా అమర్చాలని సూచించారు. పిల్లలను మీటర్లు, వైర్ల దగ్గరకి అనుమతించవద్దని, మండపాల్లో ఫ్యాన్లు, లైట్లు వాడేటప్పుడు ఓవర్ లోడ్ చేయకూడదని స్పష్టం చేశారు. గణేష్ విగ్రహాలను తరలించేటప్పుడు విద్యుత్ లైన్లకు తగలకుండా జాగ్రత్త వహించాలన్నారు. అత్యవసర సమయాల్లో ఏపీఈపీడీసీఎల్ హెల్ప్ లైన్ నెంబర్ 1912కి సంప్రదించాలని సూచించారు. వర్షాకాలంలో విద్యుత్ పరికరాలు తడవకుండా చూడాలని, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకరాదని తెలిపారు. షార్ట్ సర్క్యూట్ / స్పార్కింగ్ గమనించిన వెంటనే మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలని, పూలమాలలు, కాగితం, ప్లాస్టిక్ వస్తువులు విద్యుత్ లైట్ల దగ్గర ఉంచరాదనిచ సూచించారు.

వాహన మిత్ర అమలు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర వెంటనే అమలు చేయాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఎపి డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడ రేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల గోవింద్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా కోన లక్ష్మణ, అధ్యక్షులుగా పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా మార్కెండేయులు, అంజికుమార్, ప్రధాన కార్యదర్శిగా కోరిబిల్లి జగదీష్, సహాయ కార్యదర్శిగా సూరిశెట్టి బాపు నాయుడు, కోశాధికారిగా కుర్రం నాగరాజు ఎన్నికయ్యారు.

గణపతి సన్నిధిలో అమర్‌నాథ్

ప్రజాశక్తి-చోడవరం : వైసిపి చోడవరం నియోజవర్గం ఇన్చార్జి, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరుడిని శుక్రవారం దర్శించుకున్నారు. చోడవరం కమ్యూనిటీ టీం ఆధ్వర్యంలో నెలకొల్పిన 63 అడుగుల ఆది గణపతిని, పిఎస్.పేటలో నెలకొల్పిన విఘ్నేశ్వర మండపాన్ని సందర్శించి వినాయకుని గుడిలో పూజలు నిర్వహించారు. జెడ్‌పిటిసి మారిశెట్టి విజయ, ఎంపీపీ గాడి కాసులమ్మ , మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఏడవక సత్యారావు, మాజీ జెడ్పిటిసి బి.సూర్యనారాయణ, పల్లా నర్సింగరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వీర వెంకట సత్యనారాయణ, వైసిపి యుజవన విభాగం జిల్లా అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు గూనూరు రాజు, ఒరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

టిడిపిలో అసంతృప్తి సెగలు

సొమ్మొకరిది, సోకొకరిది అని ఆవేదన

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

అనకాపల్లి రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీకి ఓ ప్రత్యేక స్థానం ఉన్నా, ఇటీవల పరిస్థితులు పార్టీ బలోపేతానికి కాకుండా, అంతర్గత అసంతృప్తికి దారి తీస్తున్నాయి. ఎన్నాళ్లుగానో పార్టీ కోసం కష్టపడుతున్నవారిలో తగిన గుర్తింపు లేదన్న బాధ బలంగా వినిపిస్తోంది. కష్టపడి ఖర్చు చేసేది ఒకరు అయితే, లాభపడేది మరొకరు అన్న భావన కొందరిలో వ్యక్తమవుతుంది. పార్టీకి ఆర్థికంగా సహకరించినవారు, తమ వ్యక్తిగత వనరులు పెట్టి కార్యకలాపాలు నడిపినవారు ఇప్పుడు ఆర్థికంగా నష్టపోయామన్న భావనలో ఉన్నారు. ఒక్క పైసా ఖర్చు పెట్టకుండా మీడియా ప్రచారాన్ని వాడుకొని పదవులు పొందుతుండటం కూడా కొందరికి మింగుడుపడటం లేదు. ఇటీవల కార్పొరేషన్ పదవులు కూడా అడ్డదారుల్లో వెళ్ళినవారికే దక్కాయనే భావన బలపడటంతో అసంతృప్తి మరింత పెరిగిందనేది ఆ పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభావంతోనే తమకు అవకాశాలు తగ్గిన పరిస్థితిని సర్దుబాటు చేసుకోలేకపోతున్నారు. సమీకరణాల వలన తమకెలాంటి పదవులు రావని స్థానిక నాయకులు ముందుగానే నిర్ణయించుకుని నిరుత్సాహానికి లోనవుతున్నారు కూడా.

దీనితో పాటు అనకాపల్లి టీడీపీ మూడు వర్గాలుగా విడిపోయి ఉందన్నది ఓపెన్ సీక్రెట్. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కేంద్రాలుగా ఈ మూడు గ్రూపులు నడుస్తున్నాయి. ఈ గ్రూపుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఎక్కువగా గందరగోళం నెలకుంటోంది. పీలా గోవింద సత్యనారాయణకు స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో ఉన్న సంబంధాలు, ఆయనతో పాటు ఆయన గ్రూపులో కొందరికి పదవులు రావడంతో ఆయన గ్రూపువారు కొంత సంతృప్తిగా ఉన్నా మిగిలిన రెండు గ్రూపుల వారికి పదవుల విషయంలో పెద్దగా ప్రాధాన్యత లేకపోవడంతో వారిలో తమ భవిష్యత్తు ఏంటనే ఆందోళన కనబడుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో టిడిపి పరిస్థితి అగమ్యగోచరంగా మారే అవకాశాలు ఉంటాయన్నది అభిమానుల మాట.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

అనకాపల్లిలో నివాళి అర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, తెలుగు భాష తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేసిన రామ్మూర్తి పంతులు తెలుగుభాషా సంస్కర్తల్లో అగ్రగణ్యులుగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసి ఎం.జాహ్నవి, డిఆర్ఒ వై.సత్యనారాయణరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన స్థానిక వన్ వే ట్రాఫిక్ జంక్షన్ తెలుగు తల్లి విగ్రహం వద్ద తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణ మోహన్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శ్రీగాయత్రి పాఠశాలలో పాఠశాల ప్రతినిధి బి.రామకుమార్, హెచ్ఎం వై.నగేష్ గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో హాజరై పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

కోటవురట్ల : మండలంలోని వెంకటాపురం జెడ్‌పి హైస్కూల్‌లో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎలమంచిలి శ్రీను, ఉపాధ్యాయులు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు పాటలు, డిబేట్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ బి శంకర్ గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్ సత్యనారాయణ, ఎం.రతన ప్రకాష్, ఎంవి.రామకృష్ణ పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు ఎస్ఈ.లక్ష్మణరావు, ఎంజె.రవీంద్రబాబు రామ్మూర్తి పంతులు చిత్ర పటానికి నివాళులర్పించారు. తెలుగులో పిల్లలకు వ్యాసరచన, పద్య పఠన పోటీలు నిర్వహించారు.

చోడవరం : చోడవరం శాఖా గ్రంథాలయంలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాత రాజశేఖర్, రామయ్య రెడ్డి, గ్రంథాలయ అధికారి ఎంఎస్ఎల్.జోగేశ్వరిరాజు, అప్పలరాజు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి జెడ్‌పి హైస్కూల్‌లో హెచ్ఎం కె.సత్యారావు గిడుగు రామమూర్తి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పుష్పాంజలి ఘటించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. బుర్రకథ, గిడుగు, రాణి రుద్రమదేవి ఏక పాత్రాభినయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు అనసూయ, బాలలను సత్కరించారు. వివిధ పద వినోదలాల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

కె.కోటపాడు : స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో పరిషత్ ఉన్నత పాఠశాల లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వీటిని పురస్కరించుకొని విద్యార్థులకు పద్యాల పోటీ, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు, వివిధ రకాల ఆటలు పోటీలను నిర్వహించారు. వంద మంది కవుల చిత్రపటాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్వీ పద్మావతి, ఉపాధ్యాయులు మండల మురళీకృష్ణ, ఎవి రమణమ్మ, కృష్ణవేణి, ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం జెడ్‌పి హైస్కూల్‌లో గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యానచంద్ చిత్ర పటాలకు ఇన్‌ఛార్జి హెచ్ఎం పిబిటి.సుందరి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన సామూహిక నృత్యం ఆకట్టుకుంది. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనపరెడ్డి సత్యవతి, సూర్య ప్రభ, పుట్ట నారాయణ పాల్గొన్నారు.

నర్సీపట్నం:నర్సీపట్నం తురకబడి పాఠశాల ఆవరణలో శుక్రవారం గిడుగు రామమూర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యులు కేవి రమణ పిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు.చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వి.బాలాజీ ఆధ్వర్యంలో ముందుగా గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయులు వేణుగోపాల శర్మ, ప్రసన్న తెలుగు భాష గొప్పతనం గురించి వివరించారు.జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు ఎస్ వివి సత్యదేవశర్మ, తెలుగు ఉపాధ్యాయులు వేణుగోపాల శర్మ, ప్రసన్న లను ఘనంగా సత్కరించారు.విద్యార్థులు గిడుగు వెంకట రామమూర్తి వేష ధారణలో ఎంతగానో ఆకట్టుకున్నారు. పెదబోదుగల్లం హైస్కూల్లో హెచ్ఎం ఎస్.జయశ్రీ ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయుడు ఎన్ వి ఎస్ ఆచార్యులు విద్యార్థులకు పద్య పఠనంపై పోటీలు నిర్వహించారు. ఉద్దండపురం హైస్కూల్లో హెచ్ఎం నాగన్న దొర ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. పరమానందయ్య శిష్యుల వేషధారణలో విద్యార్థులు ఎంతగానో అలరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో పరమానంద శిష్యుల వేషధారణలో పిల్లలు

తగరపువలస : భీమిలి మండలం, తాటితూరు జెడ్పీ హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.వెంకటేశ్వర్లు, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అదనపు కార్యదర్శి టిఎస్‌వి.ప్రసాదరావు , ఉపాధ్యాయులు టివి.సూర్య నారాయణ, గంగరాజు తదితరులు పాల్గొన్నారు. తెలుగు భాష ప్రాధాన్యతపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి, తెలుగు అధ్యాపకులు ఎంవి.సంతోష్ యాదవ్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో గిడుగు వెంకట రామమూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్, పాల్గొన్నారు. భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.సురేఖ, తెలుగు విభాగాధిపతి డి.ప్రవీణ, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ బి.ప్రసాద్ తది తరులు పాల్గొన్నారు

గాజువాక : జివిఎంసి 70వ వార్డు పరిధి చట్టివానిపాలెం భాస్కర్ విద్యా నికేతన్‌లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తెలుగు భాషకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ప్రిన్సిపల్ పి.రమాదేవి అందించారు. చిన్నారులు తెలుగు భాష గొప్పతనం తెలిపే పాటలు పాడి, నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు శంకర్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : బోయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : సమత కళాశాలలో జరిగిన తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో కళాశాల డీన్ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.విజయరవీంద్ర, తెలుగు అధ్యాపకులు డాక్టర్ బి.రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

ములగాడ : పిలకవానిపాలెంలోని లక్ష్మీ అమర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ప్రిన్సిపాల్ వాసుదేవరావు ఆధ్వర్యాన వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు భాషా ప్రాచుర్యాన్ని తెలియజేసే అనేక గీతాలను విద్యార్థులు ఆలపించి, నృత్య ప్రదర్శనలిచ్చారు. తెలుగు భాష గొప్పతనం అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు తెలుగు అధ్యాపకులు కోమలి బహుమతులు అందజేశారు.

పిలకవానిపాలెంలోని లక్ష్మీ అమర్ స్కూల్లో

కూరుకుపోయిన లారీ

బురదరోడ్డులో నిలిచిన క్వారీ లారీ

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో మరుపాక సమీపంలో బ్లాక్ మెటల్ క్వారీ భారీ లారీ శుక్రవారం ఇటీవల పడిన చినుకులకు రావికమతం సమీపంలో దాసరయ్యపాలెం గ్రామ రోడ్డు మార్గమధ్యలో కూరుకు పోవడంతో రవాణా స్తంభించింది. ఇదే రోడ్డు గుండా పిల్లవానిపాలెం, గుణెంపూడి, మరుపాక, గొంప, గుడ్డిప,తోటకూర పాలెం, గదబపాలెం, సీతయ్యపేట తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు జరుపుతూ ఉంటారు. ఈ రోడ్డు మధ్యలో లారీ నిలిచి పోవడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. క్వారీ లారీను క్రేను, జెసిబి సహాయంతో బయటికి తరలించి ట్రాఫిక్కుకు అంతరాయం కలగకుండా ఎస్సై రఘు వర్మ చర్యలు చేపట్టారు.

యూరియా అందజేస్తున్న నాయకులు

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో ఉపమాక రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేసారు. నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచ్ ప్రగడ వీరబాబు, జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు చేతుల మీదుగా రైతులకు యూరియా అందజేశారు.ఈ సందర్భంగా పిఎసిఎస్ అధ్యక్షులు బుజ్జి మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ కు సంబంధించి అవసరమైన ఎరువులను రైతులకు సకాలంలో అందించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్, ఆర్ఎస్‌కె సిబ్బంది రవికుమార్, తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి జగదీశ్వరరావు(శ్రీను), నాయకులు కొంకిపూడి దొరబాబు, రమణబాబు, సత్యనారాయణ, తోట అప్పారావు, గరగ రామ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన స్టాపర్

ప్రయాణం.. ప్రమాదకరం

ప్రజాశక్తి- నర్సీపట్నం:నర్సీపట్నం నుండి కొటవురట్ల వెళ్లే రోడ్డులో గల భాష్యం స్కూల్ వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా విద్యార్థుల భద్రత దృష్ట్యా ఏర్పాటు చేసిన స్టాపర్ ప్రమాదకరంగా ఉండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా రాత్రి సమయంలో ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురుకు ఏర్పాటు చేసిన స్టాపర్ కనిపించడం లేదని, కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు తెలిపారు. భాష్యం స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్ కనీసం రాత్రి సమయంలోనైనా తొలగించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పలుచోట్ల పారిశుధ్య పనులు

పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ సీతారామస్వామి

ప్రజాశక్తి-రావికమతం: మండల కేంద్రంలో ఎంపిడిఓ సీతారామస్వామి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. గ్రామ పుర వీధుల డ్రైనేజీలలో పూడికపోయిన చెత్తాచెదారాన్ని శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలోనూ డ్రైనేజీలు, గ్రామ పరిసరాలు, రక్షిత మంచినీటి పథకాలు, చేతి పంపు బోర్ల వద్ద పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అప్పుడే ఆరోగ్యవంతులుగా ఉండగలుగుతామన్నారు. వర్షాల సీజన్ కావడంతో ప్రజలకు అనేక రకాల వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, కాచిన మంచినీటిని తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని దేవవరం పంచాయతీ ఒడ్డిమెట్ట గ్రామంలో పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఎంపిడిఓ డి.సీతారామరాజు, డిప్యూటీ ఎంపిడిఓ చలపతిరావు పర్యవేక్షించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఇంటా తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు.

చెక్కును అందజేస్తున్న స్పీకర్ అయ్యన్న

బాధితులకు చేయూత

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. నియోజక వర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.2.40 లక్షల చెక్కులు అందజేశారు. ఇందులో గొలుగొండ మండలానికి 2, నాతవరం మండలానికి 1, మాకవరపాలెం మండలానికి 1, నర్సీపట్నం మున్సిపాలిటీకి సంబం ధించి 2 చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి పేద కుటుంబాలకు ఆపద సమయంలో ఉపయోగపడు తోందని తెలిపారు. గత ఏడాది కాలంలో నర్సీపట్నం నియోజకవర్గంలో 65 మందికి పైగా లబ్ధిదారులకు సుమారు రూ.48.40 లక్షల సహాయం అందేలా చర్యలు తీసుకున్నామన్నారు.

వాహనాన్ని తనిఖీ చేస్తున్న సిఐ

సమస్యాత్మక గ్రామాల్లో డ్రోన్లతో నిఘా

ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్ :జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గబ్బాడ, రావణాపల్లి, ఏటి గైరం పేట ప్రాంతాల్లో డ్రోన్ సహాయంతో రూరల్ సీఐ రేవతమ్మ పర్యవేక్షించారు. ఈ డ్రోన్ సహాయంతో బహిరంగంగా డ్రింకింగ్ చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. డౌనూరు చెక్ పోస్ట్ పరిసర ప్రాంతాల్లో గంజాయి రవాణా చేసే ప్రత్యామ్నాయ మార్గాల్లోనూ డ్రోన్ సహాయంతో తనిఖీలు చేపట్టారు. అదే విధంగా చెక్ పోస్ట్ వద్ద ముమ్మరంగా వాహన తనిఖీలు చేశారు.

రావికమతం:మండలంలో వినాయక చవితి ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా ఉండేందుకుగాను కొన్ని సమస్యాత్మకమైన గ్రామాలను గుర్తించి డ్రోన్లతో నిఘా పెట్టడం జరిగిందని రావికమతం ఎస్సై రఘువర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.ఐ విలేకరులతో మాట్లాడుతూ, కొత్తకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆదేశాల మేరకు రావికమతం, మేడివాడ, చినపాచీల, గుమ్మాళ్లపాడు తదితర సమస్యా త్మకమైన గ్రామాలలో డ్రోన్లను ఎగరవేసి నిఘా పెట్టడం జరిగిందన్నారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడిన వారు ఎంతటి వారైనా అటువంటి వారిపైన కఠినమైన చర్యలు తప్పవన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకొని వినాయక విగ్రహాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. నిమజ్జనంలో సాంప్రదాయ పద్ధతిలో భక్తి భావంతో కూడిన కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలన్నారు.

పవన్‌ను కలిసిన సూర్యచంద్ర

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో చర్చించినట్లు జనసేన పార్టీ ఇంచార్జ్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజన్న సూర్యచంద్ర తెలిపారు. విశాఖపట్నం వచ్చిన ఉప ముఖ్యమంత్రిని కలిసి నియోజకవర్గంలో సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరిం చామన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేతపై...

సిపిఎం ఆధ్వర్యాన కాగడాలతో నిరసన

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో టీ.అర్జా పురం పంచాయతీ డోలవానిపాలెంలో కొండదొర తెగకు చెందిన ఏడు కుటుంబాల ఆదివాసి గిరిజనులు విద్యుత్ బిల్లులు కట్టలేదని సరఫరా నిలిపివేతపై సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం కాగడాలు చేతి పట్టి వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. గోవిందరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దళితులు, గిరిజనులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందజేస్తుందన్నారు. అధిక బిల్లులు రావడంతో నాలుగు వాయిదాలలో చెల్లింపు చేస్తామని గడువు ఇవ్వమని విద్యుత్ లైన్మెన్‌ను చేతులు జోడించి విన్నవించుకున్నా వారి మాటలు లెక్క చేయకుండా విద్యుత్తు కలెక్షన్లు కట్ చేశారన్నారు. కొండను ఆనుకొని ఉన్నటువంటి ఈ గ్రామంలో రాత్రి అయితే చిన్నపిల్లలతో చీకట్లో జీవించడం చాలా ఇబ్బంది కరంగా ఉంటుందన్నారు. క్రూర జంతువుల సైతం గ్రామాలలో సంచరిస్తాయన్నారు. గ్రామంలో ఒక్కొక్క ఇంటికి రెండు విద్యుత్ బల్బులు, ఒక ఫ్యాన్ మాత్రమే ఉన్నాయని, అధిక బిల్లులు రావడానికి గల కారణాలు ఏమిటో తెలపాలని అధికారులను ప్రశ్నించారు. కరెంట్ నిలిపి వేయడంతో రాత్రి సమయంలో ఏ విధంగా చీకట్లో ఉండాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామానికి చెందిన గిరిజనులకు అధికంగా బిల్లులు రావకడంతో కట్టలేకపోయారన్నారు. వారిలో లోకల ఈశ్వరరావు విద్యుత్ బిల్లు రూ.5,481, డోల శీను రూ.7,049,

కాగడాలతో నిరసన చేపడుతున్న నేతలు, గిరిజనులు

గేదే నాగరాజు రూ.28వేలు, డోల ఈశ్వరరావు 12 వేలు, డోల పాండురాజు రూ.5 వేలు, గొటూరి కుల్లప్ప రూ.5 వేల బిల్లులు రావడంతో కట్టలేక పోయారన్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వారి ఇండ్లకు కరెంటు కనెక్షన్ యధావిధిగా ఉంచి వాయిదాలలో బిల్లులు చెల్లించుకునే అవకాశాన్ని కల్పించాలని ఆయన కోరారు. ఆదివాసి గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షుడు సింగరపు వలసియా, పాడి బెన్నయ్యలు మద్దతుగా నిలిచారు.తక్షణమే విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించకపోతే నర్సీపట్నం డి.ఈ కార్యాలయ వద్ద ఆందోళ నిర్వహిస్తామని హెచ్చరించారు.

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి-చీడికాడ:వినాయక నవరాత్రి మహెూత్సవాల సందర్భంగా చీడికాడ మండల కేంద్రంలో వినాయకుల నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో కామిరెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో పరదేశమ్మ తల్లి యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

రహదారి గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలోని మోదకొండమ్మ ఆలయం వద్ద వార్డు మెంబర్ పాడి.వెంకట్ ఆధ్వర్యంలో యువకులు స్వచ్ఛందంగా రహదారి గుంతలను పూడ్చారు. మోదకొండమ్మ ఆలయం దగ్గర నుంచి నిత్యం స్కూలుకు రాకపోకలు సాగించేందుకు నిత్యం జనాలతో రద్దీగా ఉంటుంది. దీంతో గుంతలు పూడ్చారు.

నినాదాలు చేస్తున్న రైతులు

కొనసాగిన దళిత రైతుల దీక్ష

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మాకవరపాలెం మండలం జి.కోడూరు గ్రామ దళిత రైతులు తమ భూములను నాశనం చేస్తున్న క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం చేపట్టిన నిరాహార దీక్ష శుక్రవారం 38వ రోజుకు చేరింది. వర్షంలో తడుస్తూ నిరాహార దీక్ష స్థలంలోనే వంటా వార్పు చేస్తూ రైతులు తమ నిరసనను తీవ్రతరం చేశారు. ఈ కార్యక్రమంలో జి.కోడూరు గ్రామ రైతు అత్తుమూరి అప్పారావు మాట్లాడుతూ, సర్వే నంబర్ 332లో ఉన్న క్వారీతో తమ భూములు నాశనమవుతున్నాయని, దళిత రైతుల భూములను కాపాడాలన్నారు. పార్టీలకు అతీతంగా, ప్రజా సంఘాల సహకారంతో 38 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నామని, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, అధికారులు ఇప్పటివరకు మా సమస్యను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పీకర్ ఈ సమస్యపై స్పందించి, క్వారీ అనుమతులు రద్దు చేసేలా అధికారులకు సిఫార్సు చేయాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో జి.కోడూరు గ్రామానికి చెందిన రైతులు దేముడు, అప్పారావు, లోవరాజు, అధిక సంఖ్యలో మహిళలు, చిన్నపిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా జిల్లా మహాసభపై ప్రచారం

ప్రచారం నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోటలో ఈ నెల 31న జరగనున్న అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ కశింకోటలో ఆ సంఘం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి మాట్లాడుతూ మూడు సంవత్సరాలకు ఒకసారి జరగనున్న ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. చిన్న కారు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని, మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని కోరారు. మహాసభకు జిల్లా నలుమూల నుండి ప్రతినిధులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, నాయకులు ఆర్.లక్ష్మి, సిహెచ్ మంగతాయారు, యు.నాగమణి పాల్గొన్నారు.

'చింతకింది'కి తెలుగు భాషా పురస్కారం

ప్రజాశక్తి-చోడవరం : సుప్రసిద్ధ కథ, నవలా రచయిత, నాటకకర్త, సినీ రచయిత డాక్టర్ చింతకింది శ్రీనివాసరావు ప్రతిష్టాత్మక గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా పురస్కారాన్ని శుక్రవారం అందుకున్నారు. విశాఖలోని వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో రాష్ట్ర ప్రభుత్వం అంగరంగ వైభవంగా నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన ఈ అవార్డును ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ చేతులు మీదుగా అందుకున్నారు. చోడవరంకు చెందిన చింతకింది శ్రీనివాసరావు కళింగాంధ్ర తెలుగు మాండలికాన్ని తన కథలు, నవలల ద్వారా ఖండాంతరాలకు వ్యాప్తి చేశారు. ఆయన రచనలు సరళమైన భాషలో సాగుతూ ఉత్తరాంధ్ర అక్షర సౌరభాలను వెదజల్లుతుంటాయి. దాలప్పతీర్థం, కప్పస్తంభం, కాన్పులదిబ్బ తదితర కథా సంపుటాలు ఆయన రచనా వైదుష్యానికి మచ్చుతునకలు. నంది పురస్కారం, ప్రభుత్వ ఉగాది పురస్కారం, చాసో, రావిశాస్త్రి పురస్కారాలు సహా ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఇప్పుడీ గిడుగు తెలుగు భాషా పురస్కారం ఆయన అక్షర వ్యవసాయానికి దక్కిన మరో గౌరవంగా భావించవచ్చు. ఆయనకు ఈ గౌరవం దక్కడం పట్ల తెలుగు సాహితీరంగ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురంలో రహదారి విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ట్రాన్స్‌కో అచ్యుతాపురం ఏఈ ఎం.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోసయ్యపేట, చౌడపల్లి, కొత్తూరు, కొత్త మోసయ్యపేట, రామన్నపాలెం, అచ్యుతాపురం, అనకాపల్లి రహదారిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు దీనికి సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		